క్లుప్తంగా

మెగా వైద్య శిబిరం



విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న డా.అఫ్లర

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని ఆదర్శ విద్యాలయంలో శుక్రవారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని జహీరాబాద్ ది గ్రీన్ అండ్ సీడ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శంకర్‌పాటిల్ ప్రారంభించారు. పట్టణంలోని 15 మంది ప్రభుత్వ, ప్రైవేట్ డాక్టర్ల బృందం పాఠశాల విద్యార్థులు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు చేశారు. అనంతరం వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులను పాఠశాల యాజమాన్యం సన్మానించారు.

తడి, పొడి చెత్తపై అవగాహన

నారాయణఖేడ్: ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీల్లో శుక్రవారం మున్సిపల్ శానిటరీ అధికారి శ్రీనివాస్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మాధవరెడ్డి తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. తడి చెత్త ఏది, పొడి చెత్త ఏదనే విషయాలను వివరిస్తూ సందేహాలను నివృత్తి చేశారు. ఇళ్లకు రెండు చొప్పున గతంలో చెత్త బుట్టలు పంపిణీ చేసినందున తడి, పొడి చెత్తలను వేర్వేరు బుట్టల్లో ఉంచి ఇళ్ల వద్దకు వచ్చే చెత్త ఆటోల్లో వేయాలని సూచించారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు



నినాదాలు చేస్తున్న న్యాయవాదులు

నారాయణఖేడ్: రంగారెడ్డి జిల్లా కోర్టు అదనపు న్యాయమూర్తి హర్షపై జీవిత ఖైదుపడ్డ నేరస్తుడు చెప్పు విసరడాన్ని నిరసిస్తూ శుక్రవారం ఖేడ్ జూనియర్ సివిల్ కోర్టు న్యాయవాదులు విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. చెప్పు విసిరిన ఖైదీని కఠినంగా శిక్షించాలంటూ నినదించారు. స్థానిక బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు భోజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్‌రావు, ఏజీపీ సాయిలు, న్యాయవాదులు సంగమేశ్వర్‌రెడ్డి, భువనేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

నాగులపల్లిలో మొదలైన మినీ జాతర



గద్దెలకు మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

వట్‌పల్లి(అందోల్): రెండు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే ఆసియాలోనే అతిపెద్ద జాతరైన మేడారం సమ్మక్క సారలమ్మల మహాజాతర అనంతరం అక్కడి నుంచి పూజారులు వచ్చి మండలంలోని నాగులపల్లిలో సమ్మక్క, సారలమ్మల జాతరను ఘనంగా నిర్వహించే మినీ జాతర ఘనంగా ప్రారంభమయింది. ఉత్సవాలలో భాగంగా శుక్రవారం మహిళలు సమ్మక్క, సారలమ్మలకు ఒడి బియ్యం పోశారు. నిలువెత్తు బంగారం(బెల్లం) సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సమ్మక్క, సారలమ్మలను అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానపత్రిక



ఎమ్మెల్యే సంజీవరెడ్డికి ఆహ్వానపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

నారాయణఖేడ్: పెద్దశంకరంపేట మండలం గొట్టిముక్కల గ్రామంలో త్వరలో నిర్వహించనున్న ఆత్మలింగేశ్వరస్వామి ప్రాణప్రతిష్ఠ మహోత్సవానికి హాజరు కావాలని ఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఖేడ్‌లోని ఆయన నివాస గృహంలో ఉత్సకమిటీ బాధ్యులు శుక్రవారం కలిశారు. ప్రాణప్రతిష్ఠ మహోత్సవవాలతోపాటు శివ పంచాయతన నవగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉత్సవాలకు హాజరవుతానని ఎమ్మెల్యే తెలిపారు.

వీర జవాన్లకు నివాళి

జహీరాబాద్ టౌన్: పుల్వామా ఉగ్రదాడిలో అమరులైన వీర జవాన్లకు బీఆర్‌ఎస్‌వీ, యువజన సంఘాల నాయకులు శుక్రవారం నివాళులర్పించారు. పట్టణ సమీపంలోని బీదర్ చౌరస్తా అమర్ చౌక్ వద్ద కొవ్వొత్తులు వెలిగించి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌వీ నియోజకవర్గ అధ్యక్షుడు రాకేష్, నాయకులు ఆశోక్‌రెడ్డి, ఓంకార్, ఫయాజ్, జగన్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా ఇటుక బట్టీలు

ప్రకృతి వనరులను కొల్లగొడుతున్న వ్యాపారులు

ఆదాయమే ధ్యేయంగా కొంత మంది వ్యాపారులు ఇష్టారాజ్యంగా ఇటుక బట్టీలను నడుపుతున్నారు. ప్రకృతి వనరులను కొల్లగొడుతున్నారు. కార్మికులూ శ్రమదోపిడీకి గురవుతున్నారు. రెవెన్యూ, కార్మిక శాఖ అధికారులు బట్టీల వైపు తొంగి చూడటంలేదు.



జహీరాబాద్ ప్రాంతంలోని ఓ ఇటుక బట్టీ

జహీరాబాద్ టౌన్: జిల్లాలోని జహీరాబాద్, నారాయణఖేడ్, సంగారెడ్డి, అందోల్ నియోజకవర్గాలోని పలు గ్రామాల్లో వ్యాపారులు ఇష్టారాజ్యంగా ఇటుక బట్టీలను ఏర్పాటు చేశారు. ఇటుకకు మంచి డిమాండ్ ఉండటంతో ఈ వ్యాపారం మూడు పువ్వులు.. ఆరు కాయలుగా విరాజిల్లుతోంది. ఒకప్పుడు రూపాయికి ఉండే ఇటుక ప్రస్తుతం రూ.10 రూపాయలకు పైబడి పలుకుతోంది. దూర ప్రాంతాలకు తరలిస్తే ధర మరింత పెరుగుతుంది. జహీరాబాద్ నియోజకవర్గంలో సుమారు రూ.15కు పైగా ఇటుక బట్టీలు ఉన్నాయి. జిల్లాలో వందకు పైగా అనుమతులు లేకుండానే నడుపుతున్నారు.

కనిపించని నిబంధనలు

రోడ్డుకు వంద మీటర్ల దూరంపైనే ఇటుక బట్టీలను ఏర్పాటు చేసుకోవాల్సి ఉన్నా.. అలాంటి నిబంధనలు కనిపించడం లేదు. జహీరాబాద్ పట్టణ సమీపంలో హోతి(కె), కొత్తూర్, చిన్న హైదరాబాద్ తదితర గ్రామాలకు వెళ్లే రహదారుల పక్కనే బట్టీలు కనిపిస్తున్నాయి. ఇష్టారాజ్యంగా నడుస్తున్నా అడిగే వారు కరువయ్యారు. రెవెన్యూ, మైనింగ్, వైద్య తదితర శాఖల అనుమతులతోపాటు పంచాయతీల అమోదం ఉండాలి. కానీ ఎవరూ పట్టించుకోకపోవడం వల్ల యథేచ్ఛగా నడుస్తున్నాయి. దీతో స్థానిక సంస్థల ఆదాయానికి గండి పడుతోంది.

చెరువు మట్టి తరలింపు

ఇటుక బట్టీలకు మట్టి అవసరం ఉండటంతో చెరువుల నుంచి అక్రమంగా బట్టీలకు తరలిస్తున్నారు. గ్రామాల్లోని కొంత మంది నాయకులు, అధికారులకు కొంత నగదు చెల్లించి చెరువుల నుంచి టిప్పర్ల ద్వారా మట్టిని తరలించి నిలువ చేసుకుంటునారు. ఇటుక బట్టీల్లో శ్రమదోపిడీ కూడా జరుగుతోంది. ఇతర రాష్ట్రాల నుంచి కూలీలను రప్పించి వారితో పనులు చేయిస్తున్నారు. తక్కువ కూలీ డబ్బులు చెల్లించి శ్రమదోపిడీకి పాల్పడుతున్నారు. కొన్ని బట్టీల నిర్వాహకులు ఉచిత కరెంట్‌ను దుర్వినియోగం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రత్యేక నిఘా ఉంచి నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న బట్టీలపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

● వీరుడా వందనం



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి రూరల్: పుల్వామా ఉగ్రదాడిలో అమరులైన వీరసైనికులకు సంగారెడ్డిలోని సంయుక్త ఇంటర్నేషనల్ స్కూల్ ఆధ్వర్యంలో స్థానిక ఐబీ నుంచి కొత్త బస్టాండ్ వరకు నిర్వహించిన శాంతి ర్యాలీలో ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పాల్గొని నివాళలర్పించారు. జవాన్ల త్యాగాన్ని ఎప్పటికీ మర్చిపోలేనిదని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో మాజీ టీఎన్‌జీఓ రాష్ట్ర అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్, కూన వేణు, శ్రీధర్ మహేంద్ర, ఆర్.వెంకటేశ్వర్లు, నర్సింలు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

బొల్లారం మున్సిపాలిటీలో..

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని మల్లన్న బస్తీకి చెందిన బొల్లారం పబ్లిక్ స్కూల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో వీరమరణం పొందిన జవాన్లకు మున్సిపల్ యువజన నాయకుడు ప్రవీణ్‌రెడ్డి విద్యార్థులతో కలిసి నివాళులర్పించారు. అంతకుముందు విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు.

‘డబుల్‌బెడ్రూం’లను అప్పగించండి

బీఆర్‌ఎస్ నాయకులు



డబుల్ బెడ్రూం ఇళ్లను పరిశీలిస్తున్న నాయకులు

జహీరాబాద్ టౌన్: డబుల్ బెడ్రూం ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ నాయకులు రవికిరణ్, యాకూబ్, మోహన్, అబ్దుల్లా, మంజుల, రాకేశ్, ప్రభు యాదవ్ తదితరులు మండలంలోని హోతి(కె) వద్ద నిర్మించిన ఇళ్లను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నామ రవికిరణ్ తదితరులు మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.36 కోట్లతో 660 డబుల్ బెడ్రూం ఇళ్లను నిర్మించారన్నారు. లాటరీ పద్ధతిలో డ్రా తీసి లబ్ధిదారులను ఎంపిక చేశారని చెప్పారు. పనులు పూర్తికాకపోవడంతో అప్పట్లో లబ్ధిదారులకు ఇవ్వలేదని, పనులను పూర్తిచేసి పట్టా సర్టిఫికెట్ అందుకున్న లబ్ధిదారులకు ఇళ్లను అప్పగించాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ కార్యాలయాల మధ్యలో సబ్‌స్టేషన్



సబ్‌స్టేషన్ నిర్మాణం చేపడుతున్న స్థలం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాల మధ్యలో సబ్‌స్టేషన్ నిర్మాణం స్థానికంగా చర్చగా మారింది. నిత్యం రద్దీగా ఉండే కార్యాలయాల మధ్యలో సబ్‌స్టేషన్ నిర్మాణం ప్రమాదకరంగా మారవచ్చని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గతంలోనే పట్టణానికి అదనపు సబ్‌స్టేషన్ మంజూరైంది. నాటి నుండి సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం ప్రజాప్రతినిధులు, అధికారులు అనేక స్థలాలను పరిశీలించారు. చివరకు బెల్ యాజమాన్యం వద్దకు సైతం పలుమార్లు స్థానిక ప్రజాప్రతినిధులు వెళ్లి సబ్‌స్టేషన్‌కు స్థలం కేటాయించాని కోరినా అధికారులు స్పందించలేదు. నిర్మాణం కోసం కావాల్సిన స్థలం లభించకపోవడంతో అధికారులు ఏకంగా ప్రభుత్వ కార్యాయాల మధ్యలో సబ్‌స్టేషన్ నిర్మాణం మొదలుపెట్టారు. తహసీల్దార్, ఎంఈఓ, అమీన్‌పూర్ మండల పరిషత్ కార్యాలయాలు, మహిళా భవనం కూడా ఈ ప్రాంగణంలోనే ఉన్నాయి. దీంతో నిత్యం అధిక సంఖ్యలో ప్రజలు వివిధ పనుల కోసం వస్తుంటారు. దీంతో తమ వాహనాలు నిలపడానికి కూడా స్థలం ఉండదని పలువురు వాపోతున్నారు. ప్రభుత్వ కార్యాలయాల మధ్యలో సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఉన్నతాధికారులు ఎలా అనుమతులు ఇచ్చారని ప్రశ్నిస్తున్నారు.

నాకు తెలియండానే పట్టా మార్పు

తహసీల్దార్ కార్యాలయం ఎదుట మహిళ నిరసన



తహసీల్దార్ కార్యాలయ ఎదుట బైఠాయించిన బాధితురాలు శంకరమ్మ

రాయికోడ్(అందోల్): రెవెన్యూ అధికారుల తీరును నిరసిస్తూ పీపడ్ పల్లికి చెందిన శంకరమ్మ కుటుంబ సభ్యులతో కలిసి రాయికోడ్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసనకు దిగింది. బాధితురాలు శంకరమ్మ కథనం ప్రకారం.. తన అత్త పారమ్మకు నలుగురు కుమారులు. భర్త, అత్త చనిపోయారు. పారమ్మ పేరుపై ఎకరంన్నర భూమి ఉంది. అధికారులు నలుగురికి భూ పట్టా ఫౌతి మార్చాల్సి ఉండగా.. తనకు తెలియకుండానే ముగ్గురు వారసుల పేరిట పట్టా మార్పు చేసి అన్యాయం చేశారాని ఆమె ఆరోపించింది. కలెక్టర్, తహసీల్దార్ కార్యాలయాలకు వెళ్లి పలుమార్లు ఫిర్యాదు చేసినా.. అధికారులు తన గోడును పట్టించుకోవడం లేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి తనకు తనకు న్యాయం చేయాలని శంకరమ్మ వేడుకుంది. కాగా, ఈ విషయమై తహసీల్దార్ శ్రీనివాస్, డీటీ విజయ కుమార్ మాట్లాడుతూ భూ పట్టా మార్పిడి జరిగిన పూర్తి వివరాలను కలెక్టర్‌కు నివేదించామని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బాధితురాలికి న్యాయం చేస్తామని వివరించారు.

విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ



ఉపాధ్యాయులతో విద్యార్థులు

కంది (సంగారెడ్డి): మండల పరిధిలోని ఎద్దుమైలారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్వయంపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులు గా మారి పాఠాలు బోధించారు. డీఈవోగా మధుకిరణ్, ఎంఈవోగా వినయ్, హెచ్ఎంగా అఖిల్ పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జోగప్ప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు స్వయం పాలన దినోత్సవం జరుపుకున్నారు. కలెక్టర్‌గా ప్రవీణ్‌కుమార్, ఆర్‌జేడీగా ముత్యపు సాక్షి, డీఈఓగా శ్రీలత, హెచ్‌ఎంగా స్వాతి వ్యవహరించారు. పలువురు విద్యార్థులు టీచర్లుగా వ్యవహరించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఎంఈఓ నాగరం శ్రీనివాస్ అభినందించారు.

23న శివదీక్షాదారుల శోభాయాత్ర

నారాయణఖేడ్: పట్టణంలో ఈనెల 23న శివ దీక్షాదారుల భారీ శోభాయాత్ర నిర్వహించనున్నట్లు శివదీక్షాదారులు, గురుస్వాములు తెలిపారు. ఆ రోజు ఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేట్ దుర్గాభవానీ ఆలయం నుంచి ఖేడ్ పట్టణంలో కాశీనాథ్ ఆలయం వరకు నీటి కలశాలతో శోభయాత్ర ఉంటుందన్నారు. అనంతరం కాశీనాథ్ ఆలయంలో శివలింగానికి జలాభిషేకం చేయనున్నట్లు వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా అశోక్

జహీరాబాద్ టౌన్: బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా ఎర్పుల అశోక్ నియమితులయ్యారు. మండలంలోని అల్గోల్ గ్రామానికి చెందిన ఆశోక్ పార్టీకి సేవలు అందిస్తున్నారు. ఈ మేరకు ఆయనను రాష్ట్ర కౌన్సిల్‌గా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీకి చేసిన సేవలకు తగిన గుర్తింపు దక్కిందన్నారు. పార్టీ కోసం మరింత కష్ట పడుతానని చెప్పారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

జహీరాబాద్ టౌన్: పస్తాపూర్ మహీంద్ర కాలనీలోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ ఉత్సవాలు 20 వరకు కొనసాగుతాయని చెప్పారు., 15న ఉదయం సుప్రభాత సేవతో ఉత్సవాలు ప్రారంభమై అధ్యయనోత్సవాల ముగింపు ఉంటుందన్నారు. 16న అష్టోత్తర శతకలాభిషేకం, 17న రాయబారం మహోత్సవం. 18న శ్రీవారి కల్యాణం జరుగుతుందని తెలిపారు. 19న ఆలయం నుంచి జహీరాబాద్ పట్టణం గుండా స్వామి వారి ఉత్సవ మూర్తుల ఊరేగింపు కొనసాగుతుంది. 20న పూర్ణాహుతి, చక్రస్నానం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు.

పనుల పరిశీలన

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూరు డబుల్ బెడ్రూం ఇళ్లను మున్సిపల్ ప్రత్యేకపాలన అధికారి పాల్గున్ కుమార్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఆక్రమణలో ఉన్న భూమి స్వాధీనం

● బోర్డు ఏర్పాటు చేసిన అధికారులు



బోర్డు ఏర్పాటు చేస్తున్న అధికారులు

హత్నూర(సంగారెడ్డి): మండలంలోని కాసాల గ్రామ శివారులోగల సర్వే నంబర్ 336లో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు శుక్రవారం తిరిగి స్వాధీనం చేసుకున్నారు. కొంతకాలంగా దౌల్తాబాద్‌కు చెందిన కొందరు సాగుచేసుకుంటున్నారు. అయితే ఈ క్రమంలో ఆ ప్రభుత్వ భూమిని పేదల ఇళ్ల స్థలాలకు కేటాయించాలని గతంలో నిరుపేదలు గుడిసెలు వేసుకుని పోరాటం చేశారు. కొంతకాలం ఆ భూమిలో ఎవరూ ఎలాంటి కార్యకలాపాలు చేపట్టలేదు. ఇటీవల దౌల్తాబాద్ గ్రామానికి చెందిన కొందరు ఆ భూమిలో వ్యవసాయ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ ఫర్హిన్ షేక్ ఆ భూమిని పరిశీలించి అది ప్రభుత్వ భూమిగా నిర్ధారించారు. బోర్డు ఏర్పాటు చేసి ఎవరన్నా ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

హామీలు అమలు చేసే వరకు పోరాటం



కేలండర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

మునిపల్లి(అందోల్): ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన హామీలు అమలు చేయకుంటే ప్రజల తరఫున ప్రభుత్వంపై పోరాడుతామని అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. శుక్రవారం మండలంలోని పొల్కంపల్లి శివారులోని ఓ గార్డెన్‌లో మాజీ జెడ్పీటీసీ మీనాక్షి సాయికుమార్ ఆధ్వర్యంలో చేపట్టిన కేలండర్, డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రభుత్వం ప్రజలను మభ్యపెడుతూ కాలయాపన చేస్తుందని అరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులు గెలుపొందేలా ఇప్పటి నుంచే కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. మాజీ సీఎం కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలను ఇంటింటికీ తిరిగి వివరించాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు జైపాల్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి శశికుమార్, మండల ఉపాధ్యక్షుడు భాస్కర్‌తో పాటు మాజీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పోలీసుల చర్యలతో ప్రమాదాల నియంత్రణ



జాతీయ రహదారిపై అల్గోల్ చౌరస్తాలో ఏర్పాటు చేస్తున్న సూచిక డ్రమ్ములు


జహీరాబాద్ టౌన్: బైపాస్ రోడ్డులోని అల్గోల్ చౌరస్తాలో ప్రమాదాలను అరికట్టడానికి రహదారికి ఇరువైపుల రోడ్డుపై సూచిక డ్రమ్ములను ఏర్పాటు చేశారు. బైపాస్ రహదారిలో అల్గోల్ చౌరస్తా వద్ద అండర్ బ్రిడ్జి లేక ప్రమాదాల స్పాట్‌గా తయారవడంతో వాహన ప్రమాదాలు జరుగుతున్నాయి. జనవరి 11న ప్రమాదాలకు నిలయంగా చౌరస్తాలు అనే శీర్షిక సాక్షి దినపత్రికలో కథనం కూడా ప్రచురితమైంది. జహీరాబాద్ టౌన్ ఎస్ఐ కాశీనాథ్ చొరవ తీసుకొని డ్రమ్ములను ఏర్పాటు చేయించారు.

సంక్షిప్త వార్తలు

◆ **ఫీజుల వేధింపులు ఆపాలి: ఏఐఎస్‌ఎఫ్**

నారాయణఖేడ్: ఫీజుల విషయంలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు చేస్తున్న అరాచకాలను ఆపాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా నాయకుడు సీహెచ్ అశోక్ డిమాండ్ చేశారు. ఖేడ్‌లో శుక్రవారం నిర్వహించిన సంఘం డివిజన్‌స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫీజుల కోసం విద్యార్థులలో మానసిక ఒత్తిడిని పెంచుతున్నారని వాపోయారు. దీంతో విద్యార్థులు చదువులపై దృష్టిపెట్టలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు నిఖిల్, అఖిల్, ప్రవీణ్, వరుణ్, దిలీప్ పాల్గొన్నారు.

◆ **సీడ్స్ అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం**



సదాశివపేట (సంగారెడ్డి): జహీరాబాద్ దిగ్రీన్ అండ్ సీడ్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన శివశంకర్ పాటిల్‌ను శుక్రవారం సదాశివపేటలో వీరశైవ లింగాయత్ సమాజం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కార్యనిర్వాహక అధ్యక్షుడు జయప్రకాశ్, రాష్ట్ర నాయకులు గుండప్ప, విశ్వ లింగాయత్ ట్రస్టు చైర్మన్ శ్రీనివాస్, జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి నవీన్ తదితరులు పాల్గొన్నారు,

◆ **డీసీసీబీ సేవలు సద్వినియోగం చేసుకోండి**

కల్హేర్(నారాయణఖేడ్): రైతులు, వ్యాపారులు డీసీసీబీ బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలని సిర్గాపూర్ బ్యాంక్ మేనేజర్ దీపక్‌కుమార్ సూచించారు. శుక్రవారం సిర్గాపూర్ మండలం అంతర్‌గాంలో సహకార నిధి డిపాజిట్ మహోత్సవం నిర్వహించారు. బ్యాంకు ద్వారా రుణాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఫీల్డ్ అధికారి గోపాల్, పీఏసీఎస్ సీఈఓ సతీష్, మాజీ సర్పంచ్ రవి పాటిల్, డైరెక్టర్ జ్ఞానేశ్వర్ పాటిల్ పాల్గొన్నారు.

◆ **క్షయవ్యాధిని నివారిద్దాం**

జిన్నారం(పటాన్‌చెరు): క్షయ వ్యాధి రహిత సమాజానికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలని గుమ్మడిదల మండల వైద్యాధికారి మధుకర్ సూచించారు. గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని మంబాపూర్ గ్రామంలో క్షయ వ్యాధి ఎక్స్-రే క్యాంపు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. గ్రామంలోని 70 మందికి పరీక్షలు నిర్వహించగా అందులో పదిమందికి వ్యాధి లక్షణాలు ఉన్నట్లు గుర్తించారు. వ్యాధి లక్షణాలు కలిగిన వారికి తెమడ పరీక్షలు నిర్వహించి చికిత్సను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో శ్రీనివాస్, వైద్య సిబ్బంది దేవేందర్, కృష్ణ, శివ, కల్యాణి, జ్యోతి ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

◆ **దాతల సహకారంతో మరింత అభివృద్ధి**

పటాన్‌చెరుటౌన్: దాతల సహకారంతో గణేశ్‌గడ్డ దేవస్థానాన్ని మరింత అభివృద్ధి చేయడం జరుగుతుందని ఆలయ ఈవో లావణ్య తెలిపారు. ఆలయ ఆవరణలో శుక్రవారం దాతల సహకారంతో జరుగుతున్న స్వామి వారి మండపం, ప్రసాదాల కౌంటర్ల నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...గణేశ్‌గడ్డ దేవస్థానంలో భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆలయ ఆవరణలో నిత్య అన్నదాన కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ జూనియర్ అసిస్టెంట్ ఈశ్వర్, అర్చకులు జగదీశ్వర్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

◆ **సైకిళ్ల పంపిణీ అభినందనీయం**

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సైకిళ్లను అందించడం అభినందనీయమని ఎంఈవో శంకర్ దాతలను ప్రశంసించారు. మండలంలోని ఆత్మకూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సదాశివపేట ఎస్‌బీఐ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌బీఐ మేనేజర్ నాగేందర్‌ను ఎంఈవో అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు రామకోటయ్య, ఉపాధ్యాయులు సందీప్ కుమార్, జ్యోతిర్మయి, సుమలత, విద్యార్థులు పాల్గొన్నారు.

◆ **స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేస్తాం**

సదాశివపేట(సంగారెడ్డి): త్వరలో జరగనున్న సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో పోటీచేస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు షఫి అహ్మద్ తెలిపారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో అయన మాట్లాడుతూ స్థానిక రేషన్ కార్డుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనలో దరఖాస్తులు స్వీకరించినప్పటికీ మళ్లీ మీసేవలో దరఖాస్తు చేయాలని సూచించడం ఏమిటని ప్రశ్నించారు.

సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యం

◆ **సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యం**



పటాన్‌చెరు టౌన్: సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యమని కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ అన్నారు. శుక్రవారం గాంధీభవన్ లోని ప్రకాశం హాల్ లో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నేతృత్వంలో నిర్వహించిన బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణ పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ కార్యక్రమంలో నీలం మధు పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి తీసుకుంటున్న చరిత్రాత్మక నిర్ణయాలపై ప్రజా క్షేత్రంలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారన్నారు. బీసీలకు పెద్దపీట వేస్తున్నారని అన్నారు.

ఎల్‌ఓసీ అందజేత



ఎల్‌ఓసీని అందజేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్ టౌన్: పట్టణానికి చెందిన కొల్ల లక్ష్మయ్య ప్రమాదవశాత్తు తలకు తీవ్ర గాయాలతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రి లో చికిత్స పొందుతున్నాడు. ఆపరేషన్ చేయాల్సి రావడంతో ఆర్థికసాయం కోసం ఎమ్మెల్యే మాణిక్‌రావును బాధిత కుటుంబసభ్యులు కలిశారు. దీంతో శుక్రవారం ఎమ్మెల్యే వారికి రూ. 2 లక్షల ఎల్‌ఓసీని అందజేశారు.

నారాయణఖేడ్: కామారెడ్డి జిల్లా జుక్కల్‌కు చెందిన షేక్ రహిమాన్‌కు అత్యవసర ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ రూ.2.50లక్షల ఎల్‌ఓసీని మంజూరు చేయించారు. వైద్యానికి ఆటంకం కలుగరాదనే ఉద్దేశ్యంతో శుక్రవారం ఆయన సతీమణి ఉమాదేవి హైదరాబాద్‌లో షేక్ రహిమాన్ కుటుంబీకులకు ఉత్తర్వులను అందజేశారు.